

**ఈవీఎంలతో ఈజీ..**

ఈవీఎం, వీవీ ప్యాట్ వంటి యంత్రాల వినియోగంతో ఓటు నమోదు, లెక్కింపు ప్రక్రియ సులభం కానుంది. 10లో



**రూ.లక్ష కోట్లు గంగపాలు**

కాళేశ్వరం ప్రాజెక్టు కుంగి పోవడంతో రూ.లక్ష కోట్ల ప్రజాధనం గంగ పాలైందని బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. 10లో

**వాతావరణం**

గరిష్టం / కనిష్టం 31°/ 22°

జిల్లాలో గురువారం వాతావరణం చల్లబడి ఉంటుంది. కొన్ని చోట్ల చిరు జల్లులు కురుస్తాయి. రాత్రికి చలి పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### 100 శాతం హాజరు నమోదు కావాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ

దుమ్ముగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 100 శాతం నమోదయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ సతీష్ సూచించారు. బుధవారం వారు దుమ్ముగూడెంలోని మండల విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీరోజు విద్యార్థుల హాజరు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 24, 25వ తేదీల్లో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ నిర్వహించనున్నారు. భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని తొమ్మిది కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ తెలిపారు. కాగా, పోటీల ప్రారంభ సమావేశానికి కొత్తగూడెం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజు, మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాజ్‌కుమార్ అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహించనుండగా, ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

### 'ఉన్నతి'ని పటిష్టంగా అమలు చేయాలి




విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న అధికారులు

గుండాల: ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి నాగరాజశేఖర్, సీఎంఓ సైదులు అన్నారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని పలు పాఠశాలలను బుధవారం వారు సందర్శించారు. గుండాల ఉన్నత పాఠశాలలో ప్రారంభ పరీక్ష రిపోర్టులు సరిగా లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పిల్లల ప్రగతి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఇచ్చిన ట్యాబ్‌ల ద్వారా ఫేషియల్ అటెండెన్స్ తీసుకోవాలని ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ అమలును పర్యవేక్షించాలని అన్నారు.

# భద్రగిరిలో జోరు తగ్గిన కారు!

- అభ్యర్థి అలా.. ఇన్‌చార్జ్ ఇలా..
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో గందరగోళం
- ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలకు ఇక్కట్లు
- పెద్దల నుంచి నోటి మాటలే తప్ప కానరాని 'మద్దతు'




భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పరిస్థితి ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కు అన్నట్టుగా ఉంది. భద్రాచలం అభివృద్ధి కోసం స్థానికుడైన తెల్లం వెంకట్రావును గెలిపిద్దామనే నినాదంతో టాప్ గేర్‌లో పరుగెత్తిన 'కారు' పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నకొద్దీ హైవేను వీడి గతుకుల రోడ్డు మీదకు వచ్చినట్టుగా తయారైంది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

**తెల్లం ఇమేజ్ పనిచేసేనా..?**

భద్రాచలం నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నేతలందరికీ తెల్లం వెంకట్రావు వ్యవహారశైలిపై ఒక అంచనా ఉంది. వైద్యుడిగా ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆయనకు మంచి పేరుంది. ఆపదలో ఉన్న వారికి ఉచితంగా వైద్యం అందిస్తారని, కష్టాల్లో ఉన్నారని తెలిస్తే బాధితులు అడగకుండానే ఫీజులో రాయితీ ఇస్తారనే ఇమేజ్ ఆయన సొంతం. అందుకే రాజకీయంగా పెద్దగా చొరవ చూపించకపోయినా, అంచనాలను అందుకోలేని వ్యూహాలు అమలు చేయకున్నా, తెల్లానికి ఉన్న మంచి పేరు తమకు ఓట్లు తెస్తాయనే నమ్మకం బీఆర్‌ఎస్ నేతలు, కేడర్‌లో ఉంది. ఆ నమ్మకంతోనే పార్టీ అధిష్టానం కూడా టికెట్ కేటాయించింది.

**తలకుమించిన భారంగా..**

భద్రాచలం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం తలకు మించిన భారంగా మారుతోందని ఆ పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు అంతర్గతంగా మథనపడుతున్నారు. ప్రచార షెడ్యూల్ వివరాలు తమకు తెలపడమే తప్ప అందుకు తగ్గ ఏర్పాట్ల కోసం నయా పైసా ఇవ్వకుండా నియోజకవర్గంలోని పార్టీ పెద్దలు ఇబ్బంది పెడుతున్నారని కిందిస్థాయి నాయకులు వాపోతున్నారు. తమ సమస్యను అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు చెబితే..'అన్ని విషయాలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాతా మధు చూస్తారు' అంటూ బదులిస్తున్నారని, మధు దగ్గరకు వెళితే వెంకట్రావునే అడగాలంటూ బంతిని తన కోర్టులో నుంచి బయటకు నెటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఇద్దరి మధ్య తాము ఇబ్బంది పడుతున్నామని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

**కొత్త వారికే ప్రాధాన్యం..**

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి వెంకట్రావు ఓడిపోయారు. ఆ తర్వాత పార్టీలో ఉంటూనే పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గంలో కొనసాగారు. అనంతరం పార్టీని సైతం వీడారు. దీంతో భద్రాచలం నుంచి కారు గుర్తుపై పోటీ చేసేందుకు బోదబోయిన బుచ్చయ్య, మానె రామకృష్ణ వంటి నేతలు ఆసక్తి చూపించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచారు. అయితే అనూహ్య పరిణామాల మధ్య తిరిగి వెంకట్రావుకే టికెట్ దక్కింది. తమ ఆశలు ఆడియాసలు అయినప్పటికీ బుచ్చయ్య, రామకృష్ణతో పాటు వారి మద్దతుదారులంతా పార్టీ కోసం శ్రమిస్తున్నారు. అయితే వీరితో పాటు పార్టీనే అంటిపెట్టుకుని ఉన్న పాత వారికి ప్రస్తుతం తగు రీతిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం క్రమంగా పెరుగుతోంది. ఇతర పార్టీల నుంచి కొత్తగా బీఆర్‌ఎస్‌లో చేరిన వారికే పెద్ద పీట వేస్తున్నారనే చర్చ భద్రాచలం గులాబీ వనంలో జరుగుతోంది.

**ఇద్దరూ ఇద్దరే..**

బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రావుతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సైతం పార్టీ కార్యక్రమాల పట్ల చొరవ చూపించకుండా, కింది స్థాయి నేతలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పట్ల అవగాహన లేకుండా వ్యవహరించడం మొదటికే మోసం తెస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి. కేవలం నోటిమాటగా ఆదేశాలు జారీ చేస్తేనే క్షేత్రస్థాయిలో పనులన్నీ చక్కబడిపోతాయి అన్నట్టుగా ఉన్న వారి వైఖరి చివరకు పార్టీకే చేటు తెస్తోంది. దీంతో 'కారు'కు నామినేషన్ వేసిన రోజున్న సానుకూల వాతావరణం క్రమంగా బలహీనపడుతోందనే భయాందోళన పార్టీ అభిమానుల్లో కనిపిస్తోంది.

**గెలుపే లక్ష్యంగా**

తెలంగాణ ఏర్పడిన తర్వాత అసెంబ్లీకి రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు చేదు ఫలితాలే ఎదురయ్యాయి. రెండుసార్లూ పది సీట్లలో ఒక్కో స్థానంతో మాత్రమే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా గులాబీ పెద్దలు ప్రణాళిక సిద్ధం చేశారు. పార్టీ బలహీనంగా ఉన్న స్థానాలు, అంతర్గత కుమ్ములాటలు ఉన్న నియోజకవర్గాలకు ప్రత్యేకంగా ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, అశ్వారావుపేట స్థానానికి ఎంపీ నామా నాగేశ్వరరావు, భద్రాచలానికి ఎమ్మెల్సీ తాతా మధు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. వీరి నియామకం తర్వాత ఇల్లెందు, కొత్తగూడెంలో సానుకూల ఫలితాలు కనిపిస్తుండగా భద్రాచలంలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయనే భావన ఆ పార్టీ కేడర్‌లో వ్యక్తమవుతోంది.

జంగ్ తెలంగాణ

# ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం



వెబ్ కాస్టింగ్ ట్రయల్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

- ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోలింగ్ నిర్వహణకు విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్ ఎన్నికల నిర్వహణపై బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రియాంక ఆల పాల్గొన్నారు. జిల్లాలో 1,098 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9,66,439 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 8,92,352 మందికి ఓటరు స్లిప్పులు పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన 74,087 మందికి గురువారం అందజేస్తామని చెప్పారు. జిల్లాలో 1,18, 990 మందికి ఎపిక్ కార్డులు జారీ చేయాల్సి ఉండగా 1,01,876 కార్డులు పంపిణీ చేశామని 17,114 కార్డులు వచ్చే మూడురోజుల్లో అందించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఇల్లెందు, పినపాక, కొత్తగూడెం నియోజకవర్గాల్లో రెండు బ్యాలెట్ యూనిట్లను వినియోగిస్తున్నామని, రెండో యూనిట్ ర్యాండమైజేషన్ పూర్తి చేశామని చెప్పారు. ఈవీఎంల కమీషనింగ్ ప్రక్రియ శుక్రవారం వరకు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 725 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, మంగళ, బుధవారాల్లో 646 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని తెలిపారు. మిగిలిన 79 మందికి ఈనెల 25లోగా పూర్తి చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ కోసం పినపాక నియోజకవర్గంలో 13, ఇల్లెందులో ఐదు, కొత్తగూడెంలో ఐదు, అశ్వారావుపేటలో ఏడు, భద్రాచలంలో ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఇప్పటివరకు 24 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమాల్లో వెబ్‌కాస్టింగ్ నోడల్ అధికారి సులోచనారాణి, ఎన్నికల తహసీల్దార్ దారా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేకాధికారులతో సమావేశం**

పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు కమల్‌కిషోర్, గణేష్, హరికిషోర్, వ్యయ పరిశీలకులు అజయ్‌లాల్‌చంద్ సోనేజీ, సంజీబ్ కుమార్‌పాల్, పోలీస్ పరిశీలకులు స్వపన్‌సర్కార్, జయంత్‌సింగ్‌తో పోలింగ్, లెక్కింపు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలని చెప్పారు. నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లవద్ద బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. ప్రత్యేక బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్ల ఏర్పాటు బాధ్యతలను కార్యదర్శులకు అప్పగించినట్లు చెప్పారు.

**పోస్టల్ బ్యాలెట్‌కు ఏర్పాట్లు చేయాలి**

ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రియాంక ఆల రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఆర్ఓలు, ఏఆర్ఓలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్లు జారీ చేస్తున్నామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఆయా నియోజకవర్గాల్లో ఈనెల 25 నుంచి 27 వరకు ఏర్పాటు చేయనున్న ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్లు వేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు 3,575 మంది, ఇతర జిల్లాల ఉంచి ఇక్కడికి 1,410 మంది పోస్టల్ బ్యాలెట్‌లు వచ్చినట్లు వివరించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు ప్రతీక్‌జైన్, రాంబాబు, మంగీలాల్, శిరీష, కార్తీక్ పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

సిబ్బందికి శిక్షణలో ఆర్‌ఓ ప్రతీక్ జైన్

మణుగూరు టౌన్: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు ఎలాంటి తప్పులకు అవకాశం కల్పించవద్దని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పని చేయాలని ఐటీడీఏ పీఓ, పినపాక నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఓ, ఏపీఓలకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కడా సమస్య రాకుండా చూడాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని బూత్‌లకు గాను 244 మంది పీఓలు, 244 ఏపీఓలను రెండు బ్యాచ్‌లుగా విభజించి రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామని, మొదటి రోజు 275 మంది హాజరయ్యారని వివరించారు. కాగా, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, కొత్తగూడెం నుంచి శిక్షణకు హాజరైన 230 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారు. మిగిలిన వారు 29న ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ హరికిషోర్, ఏఆర్ఓ, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఉయ్యూరు కోటేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.



సీతరాంపురంలో హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ప్రతీక్‌జైన్

**హోమ్ ఓటింగ్ పరిశీలన..**

అశ్వాపురం: మండల వ్యాప్తంగా ఆరుగురు వికలాంగులు, ఎనిమిది మంది వృద్ధులకు బుధవారం ప్రత్యేక బృందాల ద్వారా వారి ఇళ్లకు వెళ్లి ఓటు నమోదు చేయించారు. బీజీ కొత్తూరు, సీతరాంపురం గ్రామాల్లో నిర్వహించిన హోమ్ ఓటింగ్ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఆర్‌ఐలు రాజేశ్వరరావు, నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, ఏఓ సాయిశంతన్‌కుమార్ పాల్గొన్నారు.

# ఇంటి వద్దకే తపాలా సేవలు

బూర్గంపాడు: తపాలా శాఖను మరింత సులభతరం చేసేలా ఇంటి వద్దే అందిస్తున్నట్లు శాఖ ఐపీఓ సుచేందర్ తెలిపారు. డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన బూర్గంపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పొదుపు, బీమా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆడపిల్లల పేరిట రూ.250తో సుకన్య సమృద్ధి ఖాతా ప్రారంభించవచ్చని, టైం డిపాజిట్స్, రికరింగ్ డిపాజిట్స్, సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్స్, కిసాన్ వికాస పత్రం తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం డాక్టర్ చెన్నం సత్యనారాయణను పోస్టల్ ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో తపాలా శాఖ ఉద్యోగులు ఆనందరావు, సుధీర్, రాజేంద్ర, సరస్వతి, అరుణ, కల్పన, స్నేహ, మౌనిక, పుల్లయ్య, చిట్టిబాబు, కల్యాణ్, అంజి, పవన్, వంశీ, వినయ్, దేవేందర్, సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అన్ని గ్రామాలకు విస్తరించేలా..**

అశ్వారావుపేటరూరల్: దేశంలోని అన్ని గ్రామాల్లో ప్రతీ ఇంటికి తపాలా సేవలు విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తపాలా సామాజిక అభివృద్ధి(డీసీడీపీ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పాల్వంచ ఎస్‌డీఐపీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అశ్వారావుపేటలోని సబ్ పోస్టాఫీస్‌లో బుధవారం 17 బ్రాంచ్ కార్యాలయాల బీపీఎంలు, ఏబీపీఎంలు, జీడీఎస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డీసీడీపీ కార్యక్రమం తపాలాతో అనుసంధానం అవుతోందని, ఇది విప్లవాత్మక మార్పు అని అన్నారు. దేశ వ్యాప్తంగా తపాలాసేవలు అన్ని గ్రామాల్లో అందుతున్నాయని, పలు పథకాలతో తపాలా శాఖ మరింత బలోపేతం అవుతోందని వివరించారు. సమావేశంలో ఎస్‌పీఎం శ్యాం మహేంద్ర, శేషు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆమెకు.. అవకాశమేది?!

**ఉమ్మడి జిల్లా ఓటర్లలో మహిళలే అత్యధికం**

- ఎన్నికల బరిలో మాత్రం వారి స్థానం అంతంతే
- ప్రధాన పార్టీల నుంచి ఇద్దరికే టికెట్
- పది స్థానాల్లో 214 మంది పోటీ.. 27 మందే మహిళలు
- గత ఎన్నికలతో పోలిస్తే మెరుగుపడినా స్వతంత్రులే ఎక్కువ

**నియోజకవర్గాల వారీగా పోటీలో ఉన్న అభ్యర్థులు**

| నియోజకవర్గం | మొత్తం | మహిళలు |
|---|---|---|
| ఖమ్మం | 32 | 06 |
| పాలేరు | 37 | 02 |
| మధిర | 15 | 00 |
| సత్తుపల్లి | 23 | 05 |
| వైరా | 12 | 00 |
| పినపాక | 18 | 02 |
| ఇల్లెందు | 20 | 04 |
| కొత్తగూడెం | 30 | 01 |
| అశ్వారావుపేట | 14 | 03 |
| భద్రాచలం | 13 | 04 |
| మొత్తం | 214 | 27 |



సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలు.. నియోజకవర్గాల వారీగా చూసినా, మొత్తంగా చూసినా మహిళా ఓటర్లే అగ్రభాగం! తద్వారా అభ్యర్థుల గెలుపోటముల్లో అతివలే కీలకపాత్ర పోషించే అవకాశముంది. అయితే, పోటీపరంగా పరిశీలిస్తే మాత్రం మహిళలు అట్టడుగున ఉండడం గమనార్హం. పది స్థానాల్లో కలిపి ఈసారి ఎన్నికల్లో 214 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా.. ఇందులో కేవలం 27 మంది మహిళలే ఉన్నారు. 2018 ఎన్నికల్లో 12 మంది మహిళలు పోటీచేయగా.. ఈసారి సంఖ్య పెరగడం ఒకటే కాస్త సంతోషం కలిగించే విషయమని చెప్పాలి.

**అతి తక్కువ...**

పది స్థానాల్లో కలిపి 214 మందిలో 27 మంది మహిళలు ఉండగా, ఇందులో ప్రధాన పార్టీల నుంచి అతి తక్కువ మందికే స్థానం దక్కింది. ఇల్లెందు బరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బానోతు హరిప్రియ, సత్తుపల్లిలో కాంగ్రెస్ నుంచి మట్టా రాగమయికి మాత్రమే అవకాశం లభించింది. మిగతా వారు ఇతర పార్టీల నుంచి, ఇంకొందరు స్వతంత్రులుగా బరిలో ఉన్నారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె అనురాధ కూడా ఇల్లెందులో స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేస్తున్నారు.

**సగానికి పైగా వారే..**

ఈనెల 11వ తేదీన విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. మొత్తం పది నియోజకవర్గాల్లో కలిపి 21,83,235 మంది ఓటర్లు ఉన్నట్లు తాజా జాబితా ద్వారా వెల్లడైంది. ఇందులో మహిళా ఓటర్లు 11,22,203 మంది, పురుషులు 10,60,910 మంది ఉన్నారు. ఇందులో ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 12,16,796 మంది కాగా, వీరిలో మహిళలు 6,27,553 మంది, పురుషులు 5,89,165 మంది ఉన్నారని వెల్లడించారు. అలాగే, భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 9,66,439 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో మహిళలు 4,94,650 మంది, పురుషులు 4,71,745 మంది ఉన్నట్లు వెల్లడైంది. ఇలా నియోజకవర్గాల వారీగా, జిల్లా వారీగా, ఉమ్మడి జిల్లా వారీగా చూసినా మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉన్నప్పటికీ వారు చట్టసభల్లో అడుగుపెట్టేందుకు మెరుగైన అవకాశాలు మాత్రం దక్కడం లేదు.

**స్థానిక సంస్థల్లో మెరుగైన స్థానం**

స్థానిక సంస్థలైన ఖమ్మం కార్పొరేషన్, మున్సిపాలిటీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. దీంతో రిజర్వేషన్ల ఆధారంగా ఆయా స్థానాల నుంచి మహిళా ప్రజాప్రతినిధులు ఎన్నికవుతున్నారు. అంతేకాక జనరల్ స్థానాల నుంచి కూడా పలువురు మహిళలు పోటీ పడి విజయం సాధించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పునుకొల్లు నీరజ, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాపు సీతాలక్ష్మి, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మొండితోక లత ఎన్నియ్యారు. ఇంకా పలువురు ఎంపీపీలుగా, సర్పంచ్‌లుగా పాలనలో సత్తా చాటుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కానీ చట్టసభల వరకు వచ్చేసరికి ఆ స్థాయిలో మహిళలకు ప్రాతినిధ్యం దక్కడం లేదు.

**ఇప్పటివరకు ఐదుగురే..**

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ 1952లో మొదలుకాగా, ఇప్పటివరకు పదిహేను సార్లు ఎన్నికలు జరిగాయి. అయితే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని స్థానాల నుంచి ఇన్నాళ్లలో కేవలం ఐదుగురు మహిళలే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1957లో ఖమ్మం ద్విసభ్య స్థానానికి జరిగిన ఎన్నికల్లో తేళ్ల లక్ష్మీకాంతమ్మ రెండో అభ్యర్థిగా, 1972లో మధిర నుంచి దుగ్గినేని వెంకట్రావమ్మ, 2009లో భద్రాచలం నుంచి కుంజా సత్యవతి, వైరా నుంచి బి.చంద్రావతి గెలిచారు. గత ఎన్నికల్లో ఇల్లెందు నుంచి బానోతు హరిప్రియ విజయం సాధించారు. ఇక ఈసారి హరిప్రియ ఇల్లెందు నుంచి, రాగమయి సత్తుపల్లి నుంచి పోటీ పడుతుండగా, 25 మంది మహిళా అభ్యర్థులు వివిధ స్థానాల్లో పోటీకి దిగారు. ఇందులో ఎంత మంది విజయం సాధిస్తారో.. తమ గళాన్ని అసెంబ్లీలో వినిపిస్తారో వేచి చూడాల్సిందే!

# కేసీఆర్‌ను గద్దె దించేందుకే కాంగ్రెస్‌తో పొత్తు

సీపీఐ జాతీయ నాయకుడు వెంకటరెడ్డి

నేలకొండపల్లి: సీఎం కేసీఆర్‌ను గద్దె దించేందుకే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి వెల్లడించారు. నేలకొండపల్లి మండలం మంగ్రాజుపల్లి, బోదులబండ గ్రామాల్లో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి బుధవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ గొప్పగా చెప్పుకునే మేడిగడ్డ కుంగి పోగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అవినీతి బయటపడిందని తెలిపారు. ధరణి పోర్టల్‌తో బీఆర్‌ఎస్ నేతలకే లాభం జరిగిందన్నారు. పాలేరులో పొంగులేటి, కొత్తగూడెంలో కూనంనేని సాంబశివరావుతో పాటు ఇతర చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.



సభలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

# హుండీ ఆదాయం రూ.1.29 కోట్లు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను అధికారులు బుధవారం లెక్కించారు. గత 58 రోజులకు గాను రూ.1,29,11,374 ఆదాయం సమోదైందని తెలిపారు. ఇందులో హుండీల్లో సమర్పించిన నగదు రూ.1,23,55,316 ఉండగా, అన్నదానానికి రూ.1,17,940, గోశాల నిర్వహణకు రూ.60,130, విదేశీ కరెన్సీ రూ.3,77,988 ఉన్నాయని వెల్లడించారు. అలాగే, 101 గ్రాముల బంగారం, కేజీ వెండి సమకూరిందని ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. లెక్కింపులో ఆలయ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు

## ప్రత్యర్థులు పక్కపక్కనే..



ప్రచారంలో విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్న ఖమ్మం బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు పువ్వాడ అజయ్‌కుమార్, తుమ్మల నాగేశ్వరరావు ఎదురుపడ్డారు. ఖమ్మం 22వ డివిజన్‌లో నాగేశ్వరరావు ప్రచారం చేస్తుండగా.. 23వ డివిజన్‌లో ప్రచారానికి వెళ్తున్న పువ్వాడ వాహనం అక్కడికి చేరుకుంది. దీంతో రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు.

– ఖమ్మంమయూరిసెంటర్

## అందంగా తీర్చిదిద్దుతా...



భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ప్రచారం చేశారు. ఆయన షాపుల్లోకి వెళ్లి వ్యాపారులు, వినియోగదారులను ఓటు అభ్యర్థించారు. ఇందులో భాగంగా హోటళ్లలో పెసరట్టు వేయడంతో పాటు ఇస్త్రీ చేయడమే కాక ఆటో నడిపారు. అలాగే, బార్బర్ షాప్‌లో ఓ వ్యక్తికి షేవింగ్ చేసి తనను గెలిపించాలని కోరారు.

– భద్రాచలం

## బుడ్డోడి అభిమానం



సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య బుధవారం పెనుబల్లి మండలంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ ప్రచారానికి ఓ కార్యకర్త కుమారుడు బీఆర్ఎస్ గుర్తుతో ఉన్న దుస్తులు ధరించి రావడమే కాక వాహనంపై సండ్ర ప్రసంగిస్తున్నంత సేపు కారు బొమ్మను ప్రదర్శించడం ఆకట్టుకుంది. – సత్తుపల్లి

## మీ ఓటు మాకే...



కొత్తగూడెం నుంచి పలు పార్టీల మద్దతుతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీ చేస్తున్నారు. మరోపక్క బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు తరఫున మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే, సీపీఐ నాయకులు ఆరో వార్డ్‌లో ప్రచారం చేస్తూ సీతాలక్ష్మి ఇంటికి వెళ్లి ఆమెను కూడా ఓటు అభ్యర్థించారు.

– సింగరేణి(కొత్తగూడెం)

## టీటీడబ్ల్యూఆర్‌డీసీ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజేశ్వరి, తదితరులు

**కొత్తగూడెంటౌన్:** వరంగల్‌లో ఇటీవల జరిగిన బాక్సింగ్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ (టీటీడబ్ల్యూఆర్‌డీసీ)ల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. పాల్వంచ కళాశాలకు చెందిన సుల్తాన్ మురారి, హరిప్రియ, కొత్తగూడెంనకు చెందిన తుస్మరేఖ వివిధ విభాగాల్లో సత్తా చాటి పతకాలు గెలుచుకున్నారు. ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్లు బి.రాజేశ్వరి, చిన్నప్పయ్య, కోచ్ సత్యంబాబు బుధవారం అభినందించారు.

## ప్రెజర్‌బాంబు పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

**చర్ల:** ప్రెజర్‌బాంబు పేలడంతో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి దంతెవాడ ఏఎస్పీ ఆర్‌కే బర్మన్ తెలిపిన వివరాలు.. దంతెవాడ జిల్లాలోని అరన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి కుమ్మర్‌గూడ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనుల వద్ద బస్తర్ ఫైటర్స్‌కు చెందిన పోలీసు బలగాలను రక్షణ కోసం నియమించారు. అయితే, మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబును తొక్కడంతో అది పేలగా ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో హెలీకాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించగా మరొకరిని జిల్లా కేంద్రమైన దంతెవాడకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ఈవీఎంతో ఈజీ..



ఈవీఎం.. వీవీప్యాట్.. నోటా వంటి సౌకర్యాలతో కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతికత, పారదర్శకతతో కూడిన సంస్కరణలు ప్రవేశపెడుతోంది. 2009 సార్వత్రిక ఎన్నికల నుంచి ఈవీఎంలను వినియోగంలోకి తెచ్చింది. అప్పటి నుంచి ఓటింగ్, కౌంటింగ్ సులభతరంగా మారింది. 1999 ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ముద్రణకు కొన్ని వేల టన్నుల కాగితం అవసరమైంది. ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)ల రాకతో 15 ఏళ్లుగా ఆ భారం తప్పింది. అయితే 1982లో కేరళ రాష్ట్రంలోని పర్వూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో తొలిసారిగా ఈవీఎంలను ఉపయోగించారు. ఈ నెల 30న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలు తెలుసుకుందాం. – భద్రాచలం అర్బన్

- సులభంగా ఓటు నమోదు, లెక్కింపు
- వీవీప్యాట్, నోటా సౌకర్యాలూ అందుబాటులోకి..
- పారదర్శకంగా ఎన్నికల సంఘం సంస్కరణలు
- తొలుత 2009 సార్వత్రిక ఎన్నికల్లో వినియోగం

### గరిష్టంగా 2 వేల ఓట్ల రికార్డు..

ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో నోటాతోపాటు 15 మంది అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఒకవేళ అంతకంటే ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్ యూనిట్ వినియోగించాల్సి ఉంటుంది. ఇలా ఒక ఈవీఎంకు 24 బ్యాలెట్ యూనిట్లు అనుసంధానించవచ్చు. తద్వారా 384 మంది అభ్యర్థుల సేవలు అందిస్తుంది. ఇక ఓట్ల విషయానికి వస్తే గరిష్టంగా 2 వేల ఓట్లను రికార్డు చేస్తుంది. కానీ ఎన్నికల్లో సాధారణంగా 1500 ఓట్లను నమోదు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

### ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటు రికార్డు..

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్. ఇది ఎన్నికల్లో పోలైన ఓట్లను ఎలక్ట్రానిక్ పద్ధతిలో రికార్డు చేయడంతో పాటు లెక్కించే పరికరం. దీనిలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తోపాటు వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ ఉంటుంది). బ్యాలెట్ బాక్సులతో పోలిస్తే ఈవీఎంల రవాణ చాలా సులభంగా ఉంటుంది. వీటికి విద్యుత్ సరఫరా అవసరం లేదు. సొంతంగా బ్యాటరీ/పవర్ ప్యాక్ సౌకర్యం ఉండటంతో విద్యుత్ సరఫరాలేని ప్రాంతాల్లో సైతం వీటిని వినియోగించవచ్చు.

### బ్లూ బటన్ నొక్కగానే ఎరుపు లైటు..

ఈవీఎం ఓటింగ్ విధానంలో కంట్రోల్ యూనిట్ ప్రిసైడింగ్ అధికారి వద్ద, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌లో ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్లూ బటన్ నొక్కగానే ఎరుపురంగు లైట్ మెరుస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్ నంబర్, పేరు, గుర్తు చూపించే పేపర్ స్లిప్ వీవీప్యాట్ విండో ద్వారా సుమారు 7 సెకన్లపాటు కనిపించి డ్రాప్‌బాక్స్ పడగానే కొద్దిసేపు బీప్ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.

### తొలుత మాక్ పోల్

పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో రిజల్ట్ బటన్ను నొక్కి అప్పటికే రికార్డైన ఓట్లేవీ నమోదు కాలేదని ప్రిసైడింగ్ అధికారి హాజరైన పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శిస్తారు. వీవీప్యాట్ డ్రాప్ బాక్స్ తెరిచి ఖాళీగా ఉందని చూపుతారు. వారి సమక్షంలో కనీసం 50 ఓట్లతో మాక్ పోల్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆ ఫలితాన్ని క్లియర్ చేసి అసలు పోల్ ప్రారంభించే ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌కు సీల్ వేస్తారు.

### ఓట్ల సంఖ్య తెలుసుకోవచ్చు

ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో ఫలితం బటన్ పాటు, టోటల్ బటన్ ఉంటుంది. పోల్ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్ నొక్కితే అప్పటివరకు పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్ ముగియగానే క్లోజ్ బటన్ నొక్కితే మెషిన్ ఇకపై ఓట్లను అంగీకరించదు.

### స్ట్రాంగ్ రూంలో భద్రత

పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు. అభ్యర్థులు నియమించిన ఏజెంట్లు కౌంటింగ్ వరకు ఈవీఎంలను 24 గంటలూ చూసేందుకు అనుమతిస్తారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు తాళాలు వేసి ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీల్ వేస్తారు. కౌంటింగ్ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూం తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు తర్వాత వీవీప్యాట్ స్లిప్పులను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

### మొరాయిస్తే..

పోలింగ్ సమయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ క్రమం తప్పితే బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు వీవీప్యాట్‌తో కూడిన కొత్త సెట్ ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్ దశ నుంచి పనిచేయని దశ వరకు నమోదైన ఓట్లు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ బ్యాలెట్ స్లిప్పులు, కంపార్ట్‌మెంట్ మెమరీలో భద్రంగా ఉంటాయి. వీవీప్యాట్ మాత్రమే పనిచేయకపోతే కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమరీలో భద్రంగా ఉంటాయి. దీంతో రిజర్వ్ మెషిన్ల నుంచి పనిచేయని వీవీప్యాట్ తొలగించి మరొకటి ఏర్పాటు చేసిన తర్వాత పోలింగ్ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్ యూనిట్లలో నమోదైన ఓట్లను నిర్ధారించకపోతే కంట్రోల్ యూనిట్ వీవీప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు.

### ఓటరు ఫిర్యాదు చేయవచ్చు

ఓటును నమోదు చేసిన తర్వాత వీవీప్యాట్ కనిపించే పేపర్ స్లిప్‌లో ఓటు వేసిన అభ్యర్థి కాకుండా వేరే అభ్యర్థి పేరు, గుర్తు వచ్చినట్లయితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. నిజమని తేలితే ఆ ఓటింగ్ యంత్రంలో తర్వాత ఓట్ల నమోదును నిలిపివేసి రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటారు.

జంగ్ తెలంగాణ

# రూ. లక్ష కోట్లు గంగపాలు

- కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతుల నోట్లో మట్టికొట్టారు..
- సీఎం కేసీఆర్ హామీలన్నీ నీటి మూటలే..
- ఎన్నికల సభలో బీజేపీ నేత ఈటల రాజేందర్



వేదికపై ఈటల రాజేందర్, అభ్యర్థి రవీంద్రనాయక్‌తోపాటు బీజేపీ నాయకులు

**ఇల్లెందు:** తానే ఇంజనీర్‌నని, తన తెలివి తేటల ముందు అంతా బలాదూర్ అని ప్రకటించుకున్న కేసీఆర్ కలల సౌధం కాళేశ్వరం కూలి పోయిందని, కేంద్ర అధికారులు పరిశీలించి, ప్రాజెక్ట్ నిర్మాణంలో డిజైన్ లోపం ఉందని తేల్చారని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గుర్తుచేశారు. దీంతో రూ. లక్ష కోట్ల ప్రజాధనం గంగపాలయిందని విమర్శించారు. బుధవారం ఇల్లెందులోని సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో ఇల్లెందు బీజేపీ అభ్యర్థి డి.రవీంద్ర నాయక్ గెలుపును కాంక్షిస్తూ నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. రైతులు కల్లాల్లో ధాన్యం ఆరబెట్టి ఐకేపీ సెంటర్ల చుట్టూ తిరిగారని, నిద్రహారాలు మాని కల్లాల్లో రైతులు పడిగాపులు కాశారని, చివరికి వారి నోట్లో మట్టి కొట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో డ్రిప్ పంటలు, పందిరి పంటలు, విత్తనాలకు సబ్సిడీ టార్పాలిన్ ఇవ్వడం మరిచిపోయారని పేర్కొన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీరందిస్తానని, ఇక్కడే కుర్చీ వేసుకుని కూర్చుని సమస్యలు పరిష్కరిస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ మాటలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రైతులతోపాటు రైతు కూలీలకు రూ.5 లక్షల బీమా, రూ. 10 లక్షల వరకు వైద్యం అందిస్తామని తెలిపారు. వ్యాట్ తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని, ఉద్యోగ నియామకాల క్యాలెండర్ ప్రకటిస్తామని వివరించారు. 45 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడూ ఒక బీసీని సీఎం చేయలేదన్నారు. పదేళ్ల కాలంలో ఒక్క స్కాం కూడా లేకుండా ప్రపంచ దేశాలతో శెభాష్ అనిపించుకున్న చరిత్ర ప్రధాని నరేంద్ర మోదీదని పేర్కొన్నారు. ధాన్యం క్వింటాల్ రూ.3100కు కొంటామని అన్నారు. స్థానిక సమస్యలతో పాటు రాష్ట్ర సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న రవీంద్ర నాయక్ గెలిస్తే ఈ ప్రాంత సమస్యలు సమూలంగా మారిపోతాయన్నారు. అధికారంలోకి రాగానే కొమరారం, బోడు మండలాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇల్లెందు బీజేపీ అభ్యర్థి డి.రవీంద్రనాయక్ మాట్లాడుతూ కేసీఆర్ గుండెల్లో రైల్లు పరుగెత్తించిన ఘనత ఈటల రాజేందర్‌కు ఉందని అన్నారు. బంజారా సామాజిక వర్గాన్ని వృద్ధిలోకి తెచ్చిన ఘనత తనదేనని పేర్కొన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగిన తనను గెలిపించాలని కోరారు. కాగా రాజేందర్ గంట ఆలస్యంగా సభకు వచ్చారు. సభలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలగాని గోపీకృష్ణ, నాయకులు నాళ్ల సోమసుందర్, గుగులోతు రాంచందర్ నాయక్, జర్పుల రాంచందర్, మురళీకృష్ణ, రంగాకిరణ్, సంజీవరెడ్డి, సురేంద్ర నాయక్, హతీరాం నాయక్, పూన్యా నాయక్, రుక్మారావు, శ్రీనివాసరావు, విమల్ జైన్, సంజీవరెడ్డి, భట్టు రమేష్, మావునూరి మాదవ్, ఎమ్మార్పీఎస్ నేత మెంతెన వసంతరావు, శ్రీను నాయక్, విజయలక్ష్మి, సుచిత్ర బాయి పాసీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి

గుండెపోటుతో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మృతి



ప్రచారంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో రమేష్ ( పసుపు పచ్చ చొక్కా వేసుకున్న వ్యక్తి)

**అశ్వారావుపేటరూరల్:** అశ్వారావుపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి చోటు చేసుకుంది. మండలంలోని మల్లాయిగూడెం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమానికి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గన్నమనేని రమేష్(48) అభ్యర్థి మెచ్చాతో కలిపి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. అనంతరం రోడ్ షో నిర్వహించగా, రమేష్ కూడా ప్రచార రథంపైకి ఎక్కారు. కొద్దిసేపటికే గుండెనొప్పితో ప్రచార రథంపైనే కుప్పకూలి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. తక్షణమే నాయకులు కారులో అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రమేష్ మృతితో విషాదం నెలకొంది. మృతదేహాన్ని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సందర్శించి, కుటుంబీకులను పరామర్శించారు. రమేష్ అకాల మృతి పార్టీకి తీరని లోటు అని, కుటుంబీకులకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

## నగదు సీజ్



నగదును సీజ్ చేస్తున్న అధికారులు

**దమ్మపేట:** ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును బుధవారం సీజ్ చేశారు. మండలంలోని మందలపల్లి చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేపడుతున్న క్రమంలో కారులో రూ.55 వేల నగదును గుర్తించారు. ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ, పోలీసులు తెలిపారు.

**అశ్వారావుపేటలో రూ. 54 వేలు..**

**అశ్వారావుపేటరూరల్:** అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో బుధవారం రూ.54 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన జి.రఘురామరాజు తన కారులో ఆధారాలు లేకుండా నగదు తరలిస్తుండగా సీజ్ చేసినట్లు ఎస్ఐ పి.శ్రీకాంత్ తెలిపారు.

# టేకులపల్లి టు శబరిమలై

ముగిసిన నలుగురు మాలధారుల పాదయాత్ర



పాదయాత్ర పూర్తి చేసుకున్న అయ్యప్ప మాలధారులు

**టేకులపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం టేకులపల్లికి చెందిన గురుస్వామి అంబాల బాలయ్య ఆధ్వర్యాన నలుగురు అయ్యప్ప మాలధారులు చేపట్టిన శబరిమలై పాదయాత్ర ముగిసింది. గత నెల 19న టేకులపల్లికి చెందిన అంబాల బాలయ్య, గడ్డం నవీన్, వడ్లాల శ్రీనివాస్ (కరీంనగర్), భూక్యా నాగు (కాచనపల్లి) పాదయాత్ర ప్రారంభించారు. టేకులపల్లి, కొత్తగూడెం, తిరువూరు, మైలవరం, విజయవాడ, గుంటూరు, చిలకలూరిపేట, నెల్లూరు, రెడ్‌హిల్స్, తిరుచ్చి, దిండుగల్, కుమిలి, ఎరుమేలి మీదుగా పంబ సన్నిధానానికి నాలుగు రాష్ట్రాల్లో 1,288 కి.మీ. మేర పాదయాత్ర సాగింది. ఈ మేరకు అయ్యప్ప దర్శనం పూర్తి చేసుకున్న మాలధారులు బుధవారం తిరుగు పయనమయ్యారు. కాగా, బాలయ్య గతంలోనూ రెండుసార్లు పాదయాత్ర, ఒకసారి బైక్‌పై, ఇంకోసారి సైకిల్‌పై శబరిమల వెళ్లారు.

# అప్పు తీర్చినా నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వట్లే!



వివరాలు వెల్లడిస్తున్న వృద్ధురాలు సరోజిని

**ములకలపల్లి:** తాను తీసుకున్న రుణం పూర్తిగా చెల్లించినా బ్యాంకు అధికారులు నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఓ వృద్ధురాలు ఆందోళన చేపట్టింది. ఏపీజీవీ బ్యాంకు వద్ద బుధవారం తన ఆవేదనను విలేకరులకు వివరించింది. మండల పరిధిలోని చాపరాలపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు నున్నా సరోజిని ఏపీజీవీ బ్యాంకులో వ్యవసాయ రుణం తీసుకున్నంది. రుణమాఫీలో కొంతనగదు జమకాగా, మిగతా మెత్తం చెల్లించి, బాకీ తీర్చేసింది. బుధవారం నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వాలని బ్యాంకు అధికారులను కోరగా.. ఆమె కుమారుడు శ్రీనివాస్ ఇదే బ్యాంకులో తీసుకున్న రుణం సుమారు రూ.40 వేలు చెల్లించాలని తెలిపారు. దీంతో వృద్ధురాలికి దిక్కుతోచక మనోవేదనకు గురవుతోంది. ఈ విషయమై ఏపీజీవీ మేనేజర్ భరత్‌క్రాంతిని 'సాక్షి' వివరణ కోరగా.. కుమారుడు శ్రీనివాస్ రుణం పొందిన పట్టాభూమికి సంబంధించి తల్లి సరోజిని పేరిట పాస్ బుక్ వచ్చిందని, ఈ క్రమంలో ఆ భూమి మీద ఉన్న అప్పు ఆమె పేరు మీద బదిలీ చేశామని స్పష్టం చేశారు.

# యువకుడి దారుణ హత్య

గడ్డపారతో తలను ఛిద్రం చేసిన నిందితుడు



మిర్యాల నవీన్(ఫైల్)

**బూర్గంపాడు:** నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దారుణం చోటుచేసుకుంది. పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడిని మరో యువకుడు అత్యంత దారుణంగా హతమార్చాడు. గడ్డపారతో తలను ఛిద్రం చేసి ప్రాణాలు తీశాడు. పోలీసుల కథనం ప్రకారం.. నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన ఎస్‌కే ఆఫ్రిద్ చికెన్ షాప్ నిర్వహిస్తూ, మిర్యాల నవీన్(23) వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అవివాహితులైన వీరిద్దరూ అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో సన్నిహితంగా ఉంటున్నారు. ఈ వ్యవహారంలోనే ఒకరిపై ఒకరు ద్వేషం పెంచుకున్నారు. గతంలో రెండుసార్లు ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఇటీవల నవీన్‌ను ఎలాగైనా హతమార్చాలని ఆఫ్రిద్ నిర్ణయించుకున్నాడు. మంగళవారం రాత్రి తన ఇంటి వైపు నుంచి నడుచుకుంటూ వెళ్తున్న నవీన్‌పై ఆఫ్రిద్ గడ్డపారతో దాడి చేశాడు. దీంతో సీసీ రోడ్డుపై పడిపోగా తలపై విచక్షణారహితంగా కొట్టాడు. తలమొత్తం ఛిద్రమై నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా ప్రాంతమంతా రక్త మాంసాలతో భయానకంగా మారింది. ఆ ప్రాంతాన్ని చూసేందుకు కూడా స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో సీఐ వినయ్‌కుమార్, ఎస్సైలు రాజ్‌కుమార్, నాగభిక్షం సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతునికి తల్లి, సోదరుడు ఉన్నారు.

## ఇద్దరిపై దాడి కేసు నమోదు

**అశ్వారావుపేటరూరల్:** ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరి బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కోట నాగరాజు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ముత్తిని ఏసుబాబు, వేటల వెంకన్నబాబు పాత కక్షల నేపథ్యంలో కర్రతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై తెలిపారు.

## కారు డ్రైవర్‌పై కేసు నమోదు

**పాల్వంచ:** ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 18న కొత్తగూడెం విద్యానగర్ కాలనీకి చెందిన ఆరుద్ర తన భార్యతో కలిసి మోటార్ సైకిల్‌పై భద్రాచలం వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో నాగారం స్టేజీ సమీపంలో శాఖమూరి నాగేంద్ర కుమార్ అనే కారు డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా యూటర్న్ తీసుకున్నాడు. దీంతో వెనుక నుంచి ఆరుద్ర ఢీ కొట్టి కింద పడటంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులు ఖమ్మంలో చికిత్స పొందారు. బాధితుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ నాగేంద్రకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రాములు తెలిపారు.

## మద్యం స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం

**కొత్తగూడెంఅర్బన్:** రుద్రంపూర్‌లోని బెల్టుషాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు, ఎన్నికల అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. రూ.37 వేల విలువైన 159 మద్యం బాటిళ్లు, 66 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాప్‌ను సీజ్ చేసి, నిర్వాహకుడు వీనేష్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు సీఐ జయశ్రీ , ఎక్సైజ్ ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

**ములకలపల్లి:** అక్రమంగా నిల్వచేసిన మద్యం బాటిళ్లను అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని జగన్నాథపురంలో దాడులు నిర్వహించారు. రూ. 33 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు టీమ్ బాధ్యుడు మోతీలాల్ తెలిపారు.

## వ్యక్తి మృతిపై కేసు నమోదు

**సుజాతనగర్:** భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రామవరం నాగయ్య గడ్డకు చెందిన బైరి శ్రీకాంత్ (39)కు కల్లూరు మండలం ముచ్చవరానికి చెందిన కవితతో 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. రెండేళ్లపాటు సజావుగా సాగిన వీరి కాపురంలో మనస్పర్ధలు మొదలయ్యాయి. గొడవల కారణంగా భార్య తన కూతురిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. నాలుగేళ్లుగా దంపతులు వేర్వేరుగా ఉంటుండగా, పలుమార్లు బతిమాలినా కవిత భర్త వద్దకు రాలేదు. ఈ క్రమంలో శ్రీకాంత్ ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళుతున్నానని ఈ నెల 20న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాగా సర్వారం గ్రామ శివారులోని ఓ పొలంలో పురుగుల మందు తాగి మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతుని తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.సోమేశ్వర్ తెలిపారు.

## వ్యాన్ ఢీకొని మహిళ దుర్మరణం



ప్రమాదానికి కారణమైన వ్యాన్

**అశ్వారావుపేటరూరల్:** వేగంగా దూసుకొచ్చిన ఐషర్ వ్యాన్ ఢీకొని ఓ మహిళ బుధవారం రాత్రి దుర్మరణం చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని జలగం నగర్‌కు చెందిన అల్లూరి అరుణ(45) కాలినడకన ఇంటికి వెళ్తోంది. అదే సమయంలో స్థానిక పేపర్ బోర్డు సమీపంలో ఓ ఆటో మరమ్మతులకు గురైంది. ప్రయాణికులు ఆటోను స్టార్ట్ చేసేందుకు నెడుతుండగా అరుణ కూడా వారికి తోడుగా వెళ్లింది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన ఐషర్ ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై పి.శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన ఐషర్ వ్యాన్‌ను పట్టుకున్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని ఎస్ఐ తెలిపారు. కాగా మృతురాలి భర్త గతంలోనే చనిపోయాడు.